గురువారం 27-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 377, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం

- లోక్‌సభ సభాపతిగా ఓంబిర్లా బాధ్యతలు
- మోదీ ప్రతిపాదిస్తూ సభలో తీర్మానం



ముందడుగు జాతీయం:
లోక్‌సభ సభాపతిగా మరోసారి ఓంబిర్లానే గెలుపొందారు. బుధవారం జరిగిన ఓటింగ్‌లో ఇండియా కూటమి అభ్యర్థి కె.సురేశ్‌పై ఓం బిర్లా గెలుపొందారు. మూజువాణీ ఓటుతో ఓంబిర్లా విజయం సాధించినట్లు ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రకటించారు. సభ ప్రారంభం కాగానే ఎన్డీయే కూటమి తరపున లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదిస్తూ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని రాజ్‌నాథ్ సింగ్ సహ మంత్రులు, ఎన్డీయే ఎంపీలు బలపరిచారు. మరోవైపు ఇండియా కూటమి తరపున కె.సురేశ్ మిగతా 2లో



## లోక్‌సభలో మోడీ, రాహుల్ కరచాలనం

### ఓం బిర్లాను అభినందించిన అగ్రనాయకులు

ముందడుగు జాతీయం:
లోక్‌సభ స్పీకర్‌గా బీజేపీ ఎంపీ ఓం బిర్లా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీతో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓం బిర్లాతో కరచాలనం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఓం బిర్లాను అభినందించే సమయంలో ప్రధాని మోడీ, రాహుల్ గాంధీలు కరచాలనం చేశారు. గాంధీ కుటుంబం నుంచి ప్రతిపక్ష నేతగా ఎన్నికైన మూడో నేతగా రాహుల్ గాంధీ నిలిచారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల తర్వాత ఆయన ఈ ఘనత సాధించారు. ఓం బిర్లా ఎన్నిక తర్వాత ప్రధాని మోడీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు ఓం బిర్లాని స్పీకర్ చైర్ మిగతా 2లో



స్పీకర్ ఎన్నికల్లో ఓటు వేయని ఏడుగురు ఎంపీలు

వివరాలు 2లో



రోడ్లపై చెత్తను పట్టించుకోని అధికారులు

వివరాలు 3లో





కాఫీ ప్రియుల కోసం కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ

వివరాలు 3లో



పురుషుల సంతానోత్పత్తిపై ప్లాస్టిక్ ప్రభావం

వివరాలు 4లో

## రోడ్లు సరిగా లేకుంటే టోల్ బంద్

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు

ముందడుగు జాతీయం:
రోడ్లు సరిగా నిర్వహించలేనప్పుడు టోల్ వసూలు చేయొద్దని ఆయా ఏజెన్సీలకు రోడ్లపై టోల్ ఛార్జీల వసూలు గురించి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుంతలతో కూడిన రోడ్లు, టోల్ ప్లాజాల వద్ద రద్దీ.. ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. శాటిలైట్ ఆధారిత టోల్ వసూలుపై నిర్వహించిన గ్లోబల్ వర్క్‌షాప్‌లో మిగతా 2లో



## సీబీఐ అదుపులో కేజ్రీవాల్

కస్టడీ కోరుతూ సీబీఐ దరఖాస్తు ▪ సుప్రీంలో వేసిన పిటిషన్ వెనక్కి



ముందడుగు జాతీయం:
ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసేందుకు కేంద్ర దర్యాప్తు బృందానికి కోర్టు బుధవారం అనుమతించింది. దీనిపై న్యాయమూర్తి మిగతా 2లో

ముందడుగు
గురువారం, 27-6-2024, హైదరాబాద్

## మూజువాణీ ఓటుతో
# ఓంబిర్లా విజయం

మొదటిపేజీ తరువాయి

పేరును శివసేన (యుబిటి) ఎంపీ అరవింద్ సావంత్ తీర్మానం చేశారు. దీన్ని పలువురు విపక్ష ఎంపీలు బలపర్చారు. అనంతరం స్పీకర్ పదవికి ఎన్నిక చేపట్టారు. మూజువాణీ ఓటుతో చేపట్టిన ఈ ఎన్నిక ప్రక్రియలో ఓం బిర్లా విజేతగా నిలిచారు. స్పీకర్‌గా ఎన్నికైన ఓంబి-ర్లాకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. అనంతరం ఓంబిర్లాను మోదీ, రాహుల్, కిరణ్ రిజుజు సాదరంగా సభాపతి స్థానం వద్దకు తీసుకెళ్లి స్పీకర్ కుర్చీలో కూర్చోబెట్టారు. స్పీకర్ పదవికి ఈ సారి ఎన్నిక అనివార్య-మైన విషయం తెలిసిందే. స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ప్రతిపక్షాలతో జరిపిన చర్చ లు ఫలించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వాలన్న షరతుకు ప్రభు-త్వం అంగీకరించకపోవడంతో స్పీకర్ స్థానానికి విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిని నిలిపింది. ఇండియా కూటమి తరపున సీనియ ర్ ఎంపీ కొడికు న్నిల్ సురేశ్ బరిలో నిలిచారు. దీంతో గత 50 ఏండ్లలో తొలిసారిగా, స్వతంత్ర భారత చరి-త్రలో మూడోసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరిగింది.


# స్పీకర్ ఎన్నికల్లో ఓటు వేయని ఏడుగురు ఎంపీలు

## ఇంకా ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చెయ్యాలె

ముందడుగు జాతీయం:

లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లో ఏడుగురు ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనలేకపోయారు. బుధవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఎన్నిక నిర్వహించారు. మూజువాణి ఓటుతో ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఓం బిర్లా స్పీకర్‌గా నెగ్గినట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. దాంతో ప్రతిపక్ష ఇండియా కూటమి అభ్యర్థి కె సురేష్ ఓడిపోయినట్లయ్యింది.

స్పీకర్ ఎన్నిక సందర్భంగా సభలోని ఏడుగురు ఎంపీలకు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం దక్కలేదు. ఎందుకంటే ఆ ఏడుగురు ఇంకా లోక్‌సభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయలేదు. తొలి రెండు రోజుల్లో ప్రొటెం స్పీకర్ మొత్తం 235 మంది సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. మరో ఏడుగురు మిగిలిపోయారు. బుధవారం మిగతా ఏడుగురి ప్రమాణస్వీకారాలు పూర్తికాకుండానే స్పీకర్ ఎన్నిక నిర్వహించారు.





దాంతో ఆ ఏడుగురు ఎంపీలకు స్పీకర్ ఎన్నిక సందర్భంగా ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం దక్కలేదు. ఈ అవకాశం దక్కని ఎంపీల్లో ఇద్దరు ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో ఒకరు కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, మరొకరు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ శత్రుఘ్నుసిన్హా. వీరితోపాటు తృణమూల్ కాంగ్రెస్ పార్టీకే చెందిన దీపక్ అధికారి, నురుల్ ఇస్లామ్, సమాజ్‌వాది పార్టీకి చెందిన అఫ్జల్ అన్సారీ (ముఖ్తార్ అన్సారీ సోదరుడు), మరో ఇద్దరు ఇండిపెండెంట్‌లు ఓటింగ్‌లో పాల్గొనలేకపోయారు.

## లోక్‌సభలో మోడీ, రాహుల్
# కరచాలనం

మొదటిపేజీ తరువాయి

వరకు తీసుకెళ్లారు. వరసగా రెండోసారి ఓం బిర్లా దిగువ సభ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. ఓం బిర్లా రెండోసారి ఎన్నిక కావడంపై ప్రధాని మోడీ అభినందనలు తెలియ జేశారు. రాబోయే ఐదేళ్లలో మీ మార్గనిర్దేశంలో ముందుకెళ్తా మన్నారు. ప్రతిపక్షాలు, ఇండియా కూటమి తరుపున ఓం బిర్లాను రాహుల్ గాంధీ అభినందించారు. ప్రజల గొంతుకకు మీరే మధ్యవర్తి అని, ప్రభుత్వానికి రాజకీయ అధికారం ఉండొచ్చు, కానీ ప్రతి పక్షాలు కూడా ప్రజల గొంతును వినిపిస్తాయని, ప్రతిపక్షాలను సభ లో మాట్లాడేందుకు అనుమతిస్తారనే నమ్మకం ఉందని ఆయన అన్నారు.

# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ముందడుగు శ్రీశైలం:

శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం బుడ్డా రాజశేఖరరెడ్డి శ్రీశైలం విచ్చేసిన సందర్భంగా ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం శ్రీశైల దేవస్థానం ఏఈఓలు హరిదాసు స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మ వార్లను ఆలయ రాజగోపురం ద్వారా ప్రత్యేక దర్శనం ద్వారా టీడీపీ శాసన సభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి దర్శించుకోవడం జరిగింది. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ సాంప్రదాయం



ప్రకారం శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదాలు, వేద పండితుల ఆశీర్వాదాలు అందించారు. ఆయన వెంట సహాయ కార్య నిర్వహణ అధికారులు మరియు వేద పండితులు పలువురు అధికారులు పాల్గొనడం జరిగింది.

# జన గళాన్ని బలంగా వినిపిస్తాం

- ఇండియా కూటమి తరపున అభినందిస్తున్నాం
- లోక్‌సభ స్పీకర్‌కు రాహుల్ అభినందనలు

ముందడుగు జాతీయం:

18వ లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఎన్నికైన ఓం బిర్లాను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అభినందించారు. 18వ లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్ గాంధీ బుధవారం తొలి ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజల గొంతుకను వినిపించేందుకు అనుమతించాలని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు చొరవ చూపాలని ఈ సందర్భంగా స్పీకర్‌ను కోరారు. 17వ లోక్‌సభతో పోలిస్తే ప్రస్తుత సభలో విపక్షం జన గళాన్ని మరింత బలంగా వినిపిస్తుందని చెప్పారు.

లోక్‌సభ స్పీకర్‌గా మరోసారి ఎన్నికైన మిమ్మల్ని విపక్షం తరపున ఇండియా కూటమి తరపున అభినందిస్తున్నానని తెలిపారు. సభా నిర్వహణలో తాము పూర్తిగా సహకరిస్తామని విపక్షం తరపున రాహుల్ గాంధీ స్పీకర్‌కు హామీ ఇచ్చారు. విపక్షం మాట్లాడేందుకు అనుమతించడంతో పాటు భారత



ప్రజల పక్షాన తమ ప్రాతినిధ్యాన్ని అనుమతిస్తారనే విశ్వాసం తమకుందని చెప్పారు. 18వ లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా పేరును ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బలపరిచారు. మూజువాణి ఓటుతో తీర్మానాన్ని సభ ఆమోదించింది. లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా ఎన్నికయ్యారని ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రకటించారు. కాగా, కే. సురేష్‌ను స్పీకర్ అభ్యర్థిగా నిలిపిన విపక్షం సభలో ఓటింగ్‌కు పట్టుబట్టలేదు.

# సీబీఐ అదుపులో కేజ్రీవాల్

కస్టడీ కోరుతూ సీబీఐ దరఖాస్తు ▪ సుప్రీంలో వేసిన పిటిషన్ వెనక్కి

మొదటిపేజీ తరువాయి

అమితాబ్ రావత్ ఆదేశాలు జారీ చేసిన వెంటనే సీబీఐ అధికారులు ఆయన్ని అదుపులోకి తీసుకున్నారు. తిహాడ్ కేంద్ర కారాగారం నుంచి కేజ్రీవాల్‌ను ఉదయం కోర్టు ముందు హాజరుపర్చారు. ఆయనను కస్టడీకి కోరుతూ కోర్టుకు సీబీఐ దరఖాస్తు చేసుకుంది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇప్పటికే ఆయన్ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

మరోవైపు హైకోర్టు స్టేను సవాలు చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీనిపై హైకోర్టు నిర్ణయం వెలువడ్డాకే తమ తీర్పు ఉంటుందని.. సర్వోన్నత న్యాయస్థానం సోమవారం సూచించింది. దీనిపై నేడు విచారణ చేపట్టింది. కాగా స్టేను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేజ్రీవాల్ కోరగా.. అందుకు కోర్టు అనుమతించింది. హైకోర్టు పూర్తిస్థాయి ఆదేశాలు, సీబీఐ అరెస్టు వంటి కొత్త పరిణామాల నేపథ్యంలో సమగ్ర పటిషన్‌ను దాఖలు చేస్తామని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టీతో కూడిన సెలవుకాల ధర్మాసనం అందుకు అనుమతించింది.

## రోడ్లు సరిగా లేకుంటే
# టోల్ బంద్

మొదటిపేజీ తరువాయి

ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మీరు మంచి సేవలు అందించలేనప్పుడు టోల్ ఛార్జీ వసూలు చేయొద్దు. రోడ్లు బాగా లేకపోతే ప్రజలు హర్షించారు. చాలామంది ఇప్పటికే సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. కాబట్టి మంచి రోడ్లు అందివ్వలేనప్పుడు టోల్ వసూలు చేయకూడదు. ఒకవేళ గుంతలతో కూడిన రోడ్లపై టోల్ వసూలు చేస్తే రాజకీయ నాయకులుగా మేం ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది" అని గడ్కరీ అన్నారు. టోల్ ప్లాజాల వద్ద ఆలస్యం కాకుండా చూడాలని నేషనల్ హైవే ఫీల్డ్ ఆఫీసర్లకు సూచించారు.

ముందడుగు

గురువారం,
27-6-2024,
హైదరాబాద్

# రోడ్లపై చెత్తను పట్టించుకోని అధికారులు

## టెక్కీలు, విద్యార్థులే రోడ్డును శుభ్రం చేసారు





ముందడుగు బెంగళూరు:

రోడ్లపై చెత్త, చెదారం పేరుకుపోతే అధికారులే తమ సిబ్బందితో శుభ్రం చేపించాలి. కానీ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, మట్టిని మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో టెక్కీలు, కాలేజీ స్టూడెంట్స్, స్కూల్ విద్యార్థులు రంగంలోకి దిగారు. చెత్త ఊడ్చి మట్టి ఎత్తి ఆ రోడ్డును శుభ్రం చేశారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. కడుబీసనహళ్లి, వర్తూరు మధ్య రద్దీగా ఉండే బలగెరె రహదారిపై చెత్త, మట్టి పేరుకుపోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు, నడిచి వెళ్లేవారు జారి పడుతున్నారు. బెంగుళూరు పౌర సంస్థ బీబీఎంపీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. నిధులు లేవంటూ అధికారులు నిర్లక్ష్యం వహించారు. అధికారుల తీరుతో విసిగిపోయిన బెంగళూరు వాసులు రంగంలోకి దిగారు. టెక్కీలు, విద్యార్థులు కలిసి వచ్చారు. వారాంతంలో ఆ రహదారిపై చెత్త ఎత్తివేసి క్లీన్ చేశారు. పేరుకుపోయిన మట్టిని తొలగించారు. ఈ క్లీనింగ్ డ్రైవ్‌కు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో పలువురు నెటిజన్లు స్పందించారు. రోడ్డును క్లీన్ చేసిన టెక్కీలు, స్టూడెంట్‌స్‌ను ప్రశంసించారు. బీబీఎంపీ అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. మరోవైపు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా దీనిపై స్పందించారు. కొన్నిసార్లు కొన్ని పాఠాలు ఉత్తమ గుణపాఠాలు అవుతాయని అన్నారు. బెంగళూరు వాసులు బలగెరె రోడ్‌ను క్లీన్ చేసిన సంఘటనను బీబీఎంపీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మరోసారి ఇలా జరుగకుండా చూడాలని వారిని ఆదేశించినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు.

# కాఫీ ప్రియుల కోసం కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ

## హైదరాబాద్‌లో మొదటి అవుట్‌లెట్ ప్రారంభం




ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ నగర ప్రజలకు రుచికరమైన కాపీని అందించేందుకు కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ నగరంలో అడుగుపెట్టింది. తన మొదటి ప్రీమియం కేఫ్‌ను అమీర్‌పేటలో ప్రారంభించారు. దక్షిణ భారత కాఫీ మార్కెట్‌లో వేగంగా అభివృద్ధి చెందుతున్న కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ కేఫ్ బుధవారం అమీర్‌పేట్ మెట్రో పక్కన ఉన్న వాసవి ఎంపిఎం గ్రాండ్‌లో వకీల్‌సాబ్, మల్లేశం చిత్రాలలో తన పాత్రలకు పేరుగాంచిన ప్రఖ్యాత నటి అనన్య నాగళ్ల హాజరై ప్రారంభించారు.

"హైదరాబాద్‌లో మా మొదటి ప్రీమియం అవుట్‌లెట్‌ను ప్రారంభించడం ద్వారా మా కోయంబత్తూర్ కేఫ్ మోడల్‌ను విస్తరించడం పట్ల మేము సంతోషిస్తున్నామని కోయంబత్తూర్ ఫిల్టర్ కాఫీ వ్యవస్థాపకుడు మరియు సిఈఓ గోలి గోపి అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైనా అనన్య నాగళ్ల మాట్లాడుతూ "నాకు ఫిల్టర్ కాఫీ అంటే చాలా ఇష్టం. ఈ కొత్త ప్రీమియం కేఫ్‌ను ప్రారంభించడంలో భాగమైనందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. "హైదరాబాద్‌లోని కాఫీ ప్రియులు కోయంబత్తూరు ఫిల్టర్ కాఫీ అందించే ప్రామాణికమైన మరియు రుచికరమైన రుచులను అభినందిస్తారని నాకు నమ్మకం ఉంది అని అన్నారు.

# ఇప్పటివరకు 19 శాతం తక్కువ వర్షపాతం

## దేశంలో ముందుకు కదలని రుతుపవనాలు ▪ తారుమారైనా వాతావరణ శాఖ అంచనాలు

ముందడుగు జాతీయం:

దేశంలో భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వేసిన అంచనాలు తలకిందులవుతున్నాయి. ఐఎండీ ఆశించిన విధంగా రుతుపవనాలు ముందుకు కదలడం లేదు. దేశంలోని అన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించినా వాటి ప్రభావం అంతంతమాత్రంగానే ఉంటోంది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం ఐఎండీ అంచనాల కంటే 19 శాతం తగ్గినట్లు తేల్చారు.

### రుతుపవనాల మందగమనం

దేశంలో రుతుపవనాల మందగమనం కారణంగా వర్షపాతం లోటు కనిపిస్తోంది. ప్రతీ ఏటా జూన్ లో నమోదయ్యే వర్షపాతంలో ఈసారి ఏకంగా 19 శాతం తగ్గుదల నమోదైంది. జూన్ 12 తర్వాత రుతుపవనాల మందగమనం కారణంగా దేశంలోని మొత్తం 36 సబ్ డివిజన్లలో ఏకంగా 21 చోట్ల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉన్నట్లు ఐఎండీ చెబుతోంది. ఈ నెలలో భారతదేశంలో సాధారణ వర్షా లు కురుస్తాయని ముందుగా అంచనా వేసిన భారత వాతావరణ విభాగం జూన్ 18న దాని ప్రారంభ అంచనాను సవరించుకోవాల్సి వచ్చింది.

### ఇప్పటికి పలుచోట్ల ఎండలే

జూన్ నెలలో నమోదవుతుందని భావించిన దీర్ఘకాల సగటు వర్షపాతం(ఎల్పీఏ)ను సాధారణం కంటే తక్కువగా అంటే ఏకంగా 92 శాతం తగ్గించుకోవాల్సి వచ్చింది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో వాతావరణ శాఖ తమ అంచనాల్ని మారుస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. జూన్‌లో దక్షిణ ద్వీపకల్పం, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షా లు కురుస్తాయని, వాయువ్య భారతదేశంలో సాధారణం కంటే కొంత తక్కువ వర్షపాతం ఉంటుందని అంచనా వేసిన ఐఎండీ, రుతుపవనాలకు పురోగమనానికి అనుకూల పరిస్థితులు లేకపోవడంతో వాటిని మార్చుకుంది. దేశంలో ఇప్పటివరకూ 19 శాతం తక్కువ వర్షపాతం నమోదు కాగా.. పలు చోట్ల 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తూర్పు, ఈశాన్య భారతదేశంలో -16 శాతం, మధ్య భారతదేశంలో -23 శాతం వర్షా లు నమోదయ్యాయి. దక్షిణ ద్వీపకల్పంలో మాత్రమే కాస్త అధికంగా ఉన్నట్లు ఐఎండీ చెబుతోంది. ఇక్కడ మాత్రం సాధారణ వర్షపాతం కంటే 9 శాతం ఎక్కువగా వర్షా లు పడ్డాయి.



ముందడుగు
గురువారం, 27-6-2024, హైదరాబాద్



# ఆన్‌లైన్ గేమ్‌లో గొడవపడిన గేమర్

## వందల కిలోమీటర్లు ప్రయాణించి హతమార్చాడు


ముందడుగు జాతీయం: ఓ వ్యక్తి ఆన్‌లైన్ గేమ్‌లో గొడవ పడిన మరో గేమర్‌ను హతమార్చేందుకు ఏకంగా వందల కిలోమీటర్లు ప్రయాణించాడు. నేరుగా అతడి నివాసానికి వెళ్లి సుత్తితో యువకుడి తలను పగలగొట్టాడు. ఈ ఘటన ఫ్లోరిడాలో చోటు చేసుకొంది. న్యూజెర్సీకి చెందిన ఎడ్వర్డ్ కాంగ్ ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసగా మారాడు. గేమ్ ఆడుతున్న క్రమంలో మరో గేమర్‌తో ఏదో కారణంతో వాగ్వాదానికి దిగాడు. గొడవ కాస్తా ముదరడంతో కాంగ్ ఆగ్రహానికి గురయ్యాడు. ఆ వ్యక్తిని హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. అతడి వివరాలు తెలుసుకున్నాడు. స్నేహితుడిని కలిసేందుకు వెళ్తున్నానని తల్లికి చెప్పి ఫ్లోరిడాకు బయలుదేరాడు. అలా 750 కిలోమీటర్లు ప్రయాణించి తోటి గేమర్ నివాసానికి చేరుకున్నాడు.

ఇంటి తలుపులు తెరచి ఉండడంతో లోనికి వెళ్లాడు. అప్పడే గది నుంచి బయటకు వస్తున్న యువకుడి తలపై సుత్తితో బలంగా కొట్టాడు. ఇది గమనించిన బాధితుడి తండ్రి కాంగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నారు. తీవ్ర గాయాలపాలైన యువకుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ప్రాణపాయం తప్పినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు.. ఇలాంటి ఘర్షణల నేపథ్యంలో యూరప్, నార్త్ అమెరికాలో తమ సర్వర్‌లను నిలిపివేస్తున్నట్లు సదరు గేమింగ్ సంస్థ ప్రకటించడం గమనార్హం.

## పురుషుల సంతానోత్పత్తిపై

# ప్లాస్టిక్ ప్రభావం

- పురుషుల వృషణాల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు
- ఇతర అవయవాలపై హానికర ప్రభావం



ముందడుగు ఆరోగ్యం: నేటి మనిషి జీవన విధానంలో ప్లాస్టిక్ అనేది ప్రధాన వస్తువుగా మారిపోయింది. అది లేకుండా రోజు గడవదు. అలాంటిది ఇప్పడు ప్లాస్టిక్ మన శరీరంలో కూడా ఓ భాగంగా మారిపోయింది. మంచినీళ్ల సీసా, టీ కప్పు, భోజనం ప్లేట్.. ఇలా ఏదైనా అన్నీ ప్లాస్టిక్ తోనే ముడిపడిపోయాయి. మానవజాతి మనుగడకే ప్లాస్టిక్ పెద్ద ముప్పుగా పరిణమించింది. ప్లాస్టిక్ లో ఉండే అతి చిన్న రూపమైన ప్లాస్టిక్ వ్యర్థ కణాలు గాలి, నీరు, ఆహారంద్వారా శరీరంలోకి ప్రవేశిస్తున్నాయి. దీనివల్ల గుండె, మెదడు, కాలేయం, మూత్రపిండాలు వంటి అన్ని అవయవాలపై ఇవి హానికర ప్రభావాన్ని చూపుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

### వీర్య నమూనాల్లో ప్లాస్టిక్ కణాలు

ఆహారపు అలవాట్లు మారడం, జీవనశైలి మారిపోవడంవల్ల మనిషి ఆరోగ్యం దెబ్బతింటోంది. హానికరమైన మైక్రో ప్లాస్టిక్ శరీరంలోని అన్ని అవయవాలకు చేరుతోంది. పురుషుల వృషణాల్లో మైక్రోప్లాస్టిక్ కణాలు ఉన్నట్లు తేలింది. యూనివర్సిటీ ఆఫ్ న్యూ మెక్సికోకు చెందిన పరిశోధకులు ఈ విషయాన్ని గుర్తించారు. స్పెర్మ్ సెల్స్ లో ఈ ప్లాస్టిక్ పార్టికల్స్ ఉంటాయని చైనా పరిశోధకులు కూడా తేల్చారు. చైనాలోని 36 మంది ఆరోగ్యవంతమైన యువకుల స్పెర్మ్ ను ప్రయోగశాలలో పరీక్షించారు. అన్ని నమూనాల్లో మైక్రో ప్లాస్టిక్ కణాలు ఉన్నట్లు కనుగొని వీరంతా షాక్ అయ్యారు.


### పురుషులు దూరంగా ఉంటే మంచిది

మంచినీళ్ల సీసాలు, బ్యాగుల తయారీలో ఉపయోగించే పాలీ ఇథిలిన్, పాలీ వినైల్ క్లోరైడ్, పాలీ స్టైరిన్ వంటి కణాలను పురుషుల వీర్యంలో గుర్తించారు. ఈ ప్లాస్టిక్ కణాలు సంతానోత్పత్తికి కీలకమైన స్పెర్మ్ కణాల కదలికలను అడ్డుకుంటున్నట్లు తేలింది. స్పెర్మ్ కణాల పెరుగుదల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే ఇటలీలో నిర్వహించిన మరో అధ్యయనంలో పురుషుల సంతానోత్పత్తిపై ప్లాస్టిక్ తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తేలింది. వీలైనంతమేరకు పురుషులు ప్లాస్టిక్ కు దూరంగా ఉండాలని పరిశోధకులు సూచిస్తున్నారు.

# వైద్య విద్యార్థినిపై సీనియర్లు ర్యాంగింగ్

## 300గుంజీలు తీయించడంతో కిడ్నీలో సమస్య

ముందడుగు రాజస్థాన్: వైద్య విద్యార్థినిపై సీనియర్లు ర్యాగింగ్ చేస్తూ 300 గుంజీలు తీయించారు. దీంతో ఆ విద్యార్థినికి ఒక కిడ్నీలో సమస్య వచ్చింది. ఈ విషయం తెలిసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏడుగురు సీనియర్లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజస్థాన్‌లోని దుంగార్‌పూర్ మెడికల్ కాలేజీలో ఈ సంఘటన జరిగింది. మే 15న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థిని కొందరు సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఏక ధాటిగా 300 గుంజీలు తీయించారు. దీంతో అతడి కిడ్నీలో ఇన్ఫెక్షన్ వచ్చింది. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లోని ఆసుపత్రిలో వారం రోజులు అడ్మిట్ అయ్యాడు. డాక్టర్లు నాలుగు సార్లు డయాలసిస్ చేశారు. ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆ విద్యార్థి ఈ నెలలో తిరిగి మెడికల్ కాలేజీకి వచ్చాడు. జూన్ 20న ఈ విషయం గురించి కాలేజీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు అందింది. దీంతో యాంటీ ర్యాగింగ్ కమిటీతో విచారణ జరిపించారు. ఏడుగురు సెకండ్ ఇయర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో కాలేజీ ప్రిన్సిపాల్



మంగళవారం ఏడుగురు నిందితులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముందడుగు
గురువారం,
27-6-2024,
హైదరాబాద్




# లక్కీ ఛాన్స్ కొట్టేసింది

నాగార్జున 'నాసామిరంగ'తో తెలుగు ప్రేక్షకుల మనసుల్ని దోచేసింది కన్నడ కస్తూరి ఆషికా రంగనాథ్. అయితే.. అవకాశాలు మాత్రం ఈ ముద్దుగుమ్మకు అనుకున్న స్థాయిలో రాలేదనే చెప్పాలి. ప్రస్తుతానికి తెలుగులో చిరంజీవి 'విశ్వంభర'లో కీలక పాత్ర పోషిస్తున్నదని సమాచారం. ఇదిలావుంటే.. ఇతర భాషల్లో అషికాకు అవకాశాలు బాగానే ఉన్నాయి. కన్నడలో రెండుమూడు సినిమాలు చేస్తున్న ఈ అందాలభామ.. తాజాగా తమిళంలో ఓ భారీ ఆఫర్‌ని దక్కించుకుంది. ఆ సినిమానే 'సర్దార్ 2'. కార్తీ కథానాయకుడిగా రూపొందిన 'సర్దార్' తమిళనాట భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఆ సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2'ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు పీఎస్ మిత్రన్. ఇందులో హీరోయిన్‌గా నటించే ఛాన్స్‌ను కొట్టేసింది అషికా రంగనాథ్. అంతేకాక, సిద్దార్థ్ హీరోగా నటిస్తున్న 'మిస్ యు' సినిమాలో కూడా నటిస్తున్నది అషికా. ఇవి విజయాలు సాధిస్తే కోలీవుడ్‌లో ఈ అందాలభామకు మంచిరోజులొచ్చినట్టే.

# ఇట్స్ అఫీషియల్..

## కల్కిలో విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్








పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం కల్కి. ఈ సినిమా జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా ఆకట్టుకున్నాయి. అయితే ఈ మూవీలో టాలీవుడ్ స్టార్ నటుడు విజయ్ దేవరకొండతో పాటు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను నిజం అయ్యాయి. ఈ విషయాన్ని ప్రభాస్ వెల్లడించాడు. విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్‌లతో పాటు చాలా స్టార్ కాస్ట్ ఉందంటూ ప్రభాస్ ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్విన్ దత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తుండగా.. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# నమ్మశక్యంగాని రూపం

ప్రతిష్టాత్మక పాన్ వరల్డ్ మూవీ 'కల్కి 2898 ఏడీ' గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ప్రధాన తారాగణానికి చెందిన వివిధ పోస్టర్లు, వీడియో గ్లింప్స్, టీజర్లు, ట్రైలర్లు సినిమాపై అంచనాలను ఆకాశమంత ఎత్తులో నిలబెట్టాయి. సినిమా కొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న సందర్భంగా, విడుదలకు ముందు లాస్ట్ పంచ్ అన్నట్టు.. కమల్‌హాసన్ ఫస్ట్‌లుక్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ లుక్‌లో సుప్రీం యాస్కిన్‌గా కమల్ నమ్మశక్యంగాని రూపం.. చూసేవారికి ఆశ్చర్యానికి లోనుచేస్తున్నది. మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో కమల్ కనిపిస్తున్నారు. ఇక ఈ సినిమాలో ద్రోణసుతుడైన అశ్వత్థామగా అమితాబ్ నటించిన విషయం తెలిసిందే. 39ఏళ్ల తర్వాత అమితాబ్, కమల్ కలిసి నటించిన సినిమా ఇదే కావడం గమనార్హం. వీరిద్దరు 1985లో 'గిరఫ్తార్' సినిమాలో అన్నదమ్ములుగా నటించారు.

మళ్లీ ఇన్నాళ్లకు ఈ మైథలాజికల్ సైన్స్‌ఫిక్షన్ 'కల్కి 2898ఏడీ' కోసం కలిశారు. మళ్లీ ఈ లెజెండ్స్‌ని ఒకే స్క్రీన్‌పై చూసేందుకు ఆడియన్స్



ఆతృతగా ఆసక్తితో ఎదురు చూస్తున్నారనడంలో సందేహం లేదు. ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మించిన విషయం తెలిసిందే.